క్లుప్తంగా

అలయన్స్ సేవలు విస్తృతం చేయాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ బాలచంద్రన్

బాలాజీచెరువు: అలయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతం చేయాలని అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ సి.బాలచంద్రన్ పేర్కొన్నారు. అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా 106 కార్యవర్గం ప్రమాణ స్వీకరణ మంగళవారం కాస్మోపాలిటన్ క్లబ్‌లో నిర్వహించారు. జిల్లా గవర్నర్‌గా వనుం శ్రీనివాసరావుచే ప్రమాణ స్వీకరణ చేయించి క్లబ్ ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలు, వాటి లక్ష్యాలు వివరించారు. అలయన్స్ ద్వారా వివిధ రంగాలపై దృష్టి సారించి సామాజిక భాధ్యతగా సేవలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పూర్వపు ప్రెసిడెంట్ తిరుపతిరాజు, బీఎం రావు, ఐసీసీ మెంబర్‌షిప్ కో–ఆర్డినేటర్ చప్పిడి వేంకటేశ్వరరావు, పీఆర్‌ఓ దిలీప్‌కుమార్ సదనాని పాల్గొన్నారు.

నృసింహ స్మరణతో సర్వం సాధ్యం



హోమం నిర్వహిస్తున్న మధ్వ పురోహితుడు యాతగిరి మధ్వేష్

బోట్‌క్లబ్: నృసింహ స్మరణతో అన్నీ పొందవచ్చునని మధ్వ పురోహితుడు యాతగిరి మధ్వేష్ అన్నారు. నృసింహ జయంతి సందర్భంగా స్థానిక గొడారిగుంటలోని రమా సహిత సహిత సత్యదేవ మందిరంలో మంగళవారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నృసింహ విగ్రహానికి, సాలగ్రామాలకు విశేష అభిషేకాలను నిర్వహించారు. అనంతరం నృసింహ హవనం నిర్వహించారు. నరసింహ స్వామిని అర్చించిన వారందరూ సౌభాగ్యాన్ని అనంతరం భగవంతుని సాన్నిధ్యాన్ని పొందారని పలు ఉదాహరణలతో వివరించారు. పూర్ణాహుతి కార్యక్రమాన్ని పరశురాం తుంగమణి దంపతులు నిర్వహించారు. నరసింహ భక్తి గీతాలను అమూల్య రుక్మిణి, మౌనిక ఆలపించారు.

ధ్యానంతో ఒత్తిడి, ఆందోళన దూరం



ధ్యానం చేస్తున్న ఐడీఏ సభ్యులు

బోట్‌క్లబ్: ప్రతి రోజు ధ్యానం చేయడం వల్ల ఒత్తిడి, ఆందోళన తగ్గించుకోవచ్చునని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. స్థానిక రాజేశ్వరినగర్‌ని బీ స్ట్రాంగ్ ఫిట్నెస్ సెంటర్‌లో కాకినాడ ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ధ్యానంతో బలమైన భావోద్వేగాలు తలెత్తకుండా నిరోధిస్తుందన్నారు. ధ్యానం ద్వారా ఆనందమైన ప్రశాంత జీవనాన్ని ఆస్వాదించగలమని తెలిపారు. ధ్యానంతో మంచి నిద్ర, అధిక రక్తపోటు గుండె పనితీరు, మరెన్నో ఆరోగ్య లక్షణాలను మెరుగుపరుస్తుందన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు నాగేంద్ర మాట్లాడుతూ ఏ వయసువారైనా ఈ ప్రక్రియని అభ్యసించవచ్చనన్నారు. ఈ కార్యక్రమంలో సంకీర్త్, పద్మావతి, చైతన్య, అఖిల, సిరాజ్ పాల్గొన్నారు.

ఆర్థిక వనరుల పెంపుపై శిక్షణ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో ఆర్థిక వనరుల పెంపుపై సహకార సంఘాల సీఈఓలకు వచ్చే నెలలో శిక్షణ నిర్వహిస్తున్నారు. శిక్షణ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఎస్‌ఎల్‌ఎన్‌టీ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. సహకార సంఘాల ఆర్థిక సమృద్ధిలో భాగంగా కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో సొసైటీల ఆర్థిక వనరులను పెంచేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. దీనికోసం రూపొందించిన పోర్టల్‌పై వచ్చే మూడు నెలల్లో శిక్షణలు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 288 సొసైటీల పరిధిలో రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఈ శిక్షణలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన సాంకేతిక నిపుణులు ఈ శిక్షణ ఇస్తారని తెలిపారు.

బంగారు భవితే లక్ష్యం

- దివ్యాంగులు బడిబాట పట్టేలా సమగ్రశిక్ష అధికారుల సర్వే
- ప్రత్యేక అవసరాలు గల బాలలకు వెనులుబాటు
- శిక్షణ, బోధనతో బాసట



సర్వే చేస్తున్న సమగ్రశిక్ష అధికారులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రత్యేక అవసరాల గల పిల్లలు ఇంటికే పరిమితతం కాకుండా వారిలో మానసికంగా, శారీరకంగా ఎదుగుదల తీసుకురావాలనే లక్ష్యంతో భవిత కేంద్రాల ద్వారా వారికి మానసిక, శారీరక తర్ఫీదులు ఇస్తూ చైతన్యాన్ని తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుంది. గత ఏడాది సమీప పాఠశాలల్లో విద్య అభ్యసనకు సిద్ధమైంది. శారీరక, మానసిక వైకల్యం బారినపడిన పిల్లలకు ఇప్పటి వరకూ తమను ప్రత్యేకంగా విభజించారనే భావన కలగకుండా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పలు విధి విధానాల అమలు కూడా ప్రారంభించింది. ప్రాథమిక పాఠశాలల సమీప భవిత కేంద్రాలను వాటితో అనుసంధానించారు. సాధారణ పిల్లలతో కలిసి వీరు విద్యాబుద్ధులు నేర్చుకోవడం ద్వారా వారిలో ఆలోచనలు వృద్ధి చెందుతాయనే భావనతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మాటలు రాని మానసికంగా ఎదుగుదల లేని, నడవలేని పిల్లలు ఇళ్లలో ఉండి మరింత మానసికంగా కుంగిపోకుండా వారికి భవిత కేంద్రాల ద్వారా విద్యను అందించారు. చిన్నారుల వైకల్యాలు గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తూనే సాధరణ విద్యను బోధించారు. ఈ తరహా విద్య, శిక్షణలో వృద్ధి చెందిన వారిని ఆపై సాధరణ పాఠశాలల్లో చేర్పించారు. ప్రస్తుతం పిల్లలు వేర్వేరుగా కాకుండా వారిలో అందరూ సమానమనే భావనను పెంపొందింపజేసేందుకు సాధారణ విద్యార్థుల తోనే ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు అవసరమైన చదువు చెప్పించేలా చర్యలు తీసుకుంది. దీని కోసం మండలానికి ఒక పాఠశాల ఎంపిక చేసి భవిత కేంద్రాల బాలలను ఆయా పాఠశాలల్లో విలీనం చేశారు. అక్కడ ఐఈఆర్‌టీలతో పిల్లలకు విద్య బోధిస్తారు. అక్కడే మధ్యాహ్న భోజనం, విద్యా కానుక కిట్లు, విద్యాదీవెన వంటి సౌకర్యాలు కల్పిస్తారు. ఫిజియో థెరపిస్టులు వ్యాయామం, స్పీచ్ థెరపీ, యోగా తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారు. ఐఈఆర్‌టీలు, ఫిజియో థెరపిస్టులు వారి పర్యవేక్షణలో పనిచేయాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు.

బహుళ ప్రయోజనాలు..

ప్రత్యేక అవసరాలు గల పిల్లలు చేరితే ప్రతి నెలా రూ.300 రవాణాభత్యం చెల్లిస్తారు. వినికిడి, దృష్టి లోపం ఉన్న వారికి ట్యాబ్‌లతో పాటు తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు జాతీయ ఉపకార వేతనం ఏడాదికి రూ.9 వేల నుంచి 11 వేలు అందజేస్తారు. వైకల్య శాతం అధికంగా ఉంటే సదరమ్ ధ్రువపత్రంతో పింఛను వస్తుంది. బస్సు, రైల్వేలో బస్సు పాస్ సౌకర్యంతో పాటు పాఠశాలకు రాలేని వారి ఇంటికి వచ్చి బోధనతో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఇలాంటి వారికి పాఠశాలకు వచ్చినట్లే హాజరు నమోదు అవుతుంది.

> **సద్వినియోగం చేసుకోవాలి**
>
> 
>
> ప్రభుత్వ ఆదేశాల మేరకూ దివ్యాంగులు బడిబాట పట్టేలా సర్వే ముమ్మరం చేశాం. చిన్నారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తూనే సాధారణ విద్య బోధిస్తాం. వైకల్యం కలిగిన పిల్లల్లో సామర్థ్యాన్ని పెంపొందించేందుకు సహిత విద్య తోడ్పడుతుంది. వైకల్యానికి అనుగుణంగా పరికరాలు ఉపయోగించి వారికి లైఫ్ స్కిల్స్ నేర్పించడం ద్వారా తోటి విద్యార్థులతో కలిసి చదువుకునేలా కృషి చేస్తున్నాం.
>
> – చామంతి నాగేశ్వరరావు, సీఎంఓ, సమగ్రశిక్ష, కాకినాడ

స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్ పరిశీలన



స్ట్రాంగ్ రూమ్ భద్రతను పరిశీలిస్తున్న ఆర్వో వెంకటరావు

కాకినాడ: సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు మంగళవారం ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను సందర్శించారు. రోజువారీ తనిఖీలో భాగంగా స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రతా ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. అనంతరం కౌంటింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. అక్కడి సిబ్బందికి కల్పించాల్సిన సౌకర్యాలపై సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆర్వో వెంకటరావు మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. కేంద్ర, రాష్ట్ర పోలీస్ విభాగాలు స్ట్రాంగ్ రూముల భద్రతను పర్యవేక్షిస్తాయన్నారు. అలాగే కౌంటింగ్ సెంటర్ వద్ద చేపట్టాల్సిన అన్ని ఏర్పాట్లపై సంబంధిత సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని ఆర్వో చెప్పారు. ఆయన వెంట పలువురు ఎన్నికల విభాగానికి చెందిన సిబ్బంది ఉన్నారు.

మూడు రోజుల పాటు నీటి సరఫరాకు అంతరాయం

కాకినాడ: సామర్లకోట నుంచి శశికాంత్‌నగర్ ఫిల్టరేషన్‌ప్లాంట్‌కు వెళ్లే పైపులైన్ల లీకేజీలకు మరమ్మతులు చేపట్టేందుకు గురువారం నుంచి 25వ తేదీ వరకు కొన్ని ప్రాంతాల్లో మూడు రోజులపాటు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.సత్యకుమారి తెలిపారు. శశికాంత్‌నగర్, శ్రీవిద్యకాలనీ, భాస్కర్‌నగర్, దుమ్ములపేట, సాంబమూర్తినగర్, ఏఎంజీ స్కూల్, శ్రీనివాస బ్యాంక్‌కాలనీ, గైగోలుపాడు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. 1 నుంచి 13వ డివిజన్ వరకు 49, 50 డివిజన్లలో 23వ తేదీ ఉదయం నుంచి 25వ తేదీ సాయంత్రం వరకు కలిగే నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు. ప్రజలు ముందుగా తాగు నీటిని నిల్వచేసుకోవాలని సూచించారు. అత్యవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీరు అందజేస్తామని, ఇందుకోసం 98499 06507, 99597 99138, 96767 70461, 98484 71415 ఫోన్ నంబర్లకు సంప్రదించవచ్చునని పి.సత్యకుమారి కోరారు.

విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి



కరపలో నిర్వహించిన వేసవి వినోదంలో మాట్లాడుతున్న శ్రీరామారావు

కరప: విద్యార్థులు వేసవి సెలవులను వృథా చేసుకోకుండా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్లమూరి శ్రీరామారావు పేర్కొన్నారు. స్థానిక భవననిర్మాణ కార్మికుల సంఘం భవనంలో మంగళవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి వినోదాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మూడో తరగతి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పది రోజుల పాటు వివిధ అంశాలపై మెళకువలు నేర్పుతామన్నారు. ఓరిగామి, డ్రాయింగ్, మట్టితో బొమ్మలు తయారుచేయడం, పాటలు, కథలు, సైన్స్ ప్రయోగాలు, తెలుగు భాషాంశాలు, ఇంగ్లిషు భాషా నైపుణ్యం, గణితంలో మెళకువలు వివరిస్తూ శిక్షణ ఇవ్వనున్నట్టు జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి శ్రీరామారావు తెలిపారు. ఉపాధ్యాయులు వై.శ్రీనివాసరావు, దేగల లక్ష్మి పాల్గొన్నారు.

విజ్ఞాన శిబిరాన్ని సందర్శించిన డీవైఈఓ

బాలాజీచెరువు: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ప్రధాన గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని కాకినాడ డీవైఈఓ ఆర్‌జేడీ రాజు మంగళవారం సందర్శించారు. హిందీ విశ్రాంత అధ్యాపకులు టీఎస్ లక్ష్మీకుమారి, కథలు చెప్పగా, ఉపాధ్యాయులు డి.శ్రీనివాసరావు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ శిబిరంలో 51 మంది విద్యార్థులు పాల్గొని తమకు ఆసక్తి ఉన్న అంశాలపై బోధించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ కిశోర్, సిబ్బంది రాజు, ఏవీఎస్ నాగేంద్రకుమార్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

పోస్టల్ ఓట్ల లెక్కింపునకు పటిష్ట ఏర్పాట్లు

జేసీ రామ్‌సుందర్‌రెడ్డి



పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ రామ్‌సుందర్‌రెడ్డి

కాకినాడ సిటీ: పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్, పిఠాపురం నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గం పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించి మంగళవారం కాకినాడ జేఎన్టీయూలోని సివిల్ డిపార్టుమెంట్ పీజీ బ్లాక్ వద్ద చేపట్టిన ఏర్పాట్లను ఆయన పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్‌కు వినియోగించిన ఈవీఎంలు, ఇతర పోలింగ్ సామగ్రిని జేఎన్టీయూలో నియోజకవర్గాల వారీగా ఆయా బ్లాకుల్లో సురక్షితంగా భద్రపరచినట్టు తెలిపారు. అలాగే కాకినాడ పార్లమెంటరీ నియోజకవర్గం ఉద్యోగులకు సంబంధించి పోస్టల్‌బ్యాలెట్లను జేఎన్టీయూలోని సివిల్ డిపార్టుమెంట్ పీజీ బ్లాక్‌లోను, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన పోస్టల్ బ్యాలెట్లను ఆయా నియోజకవర్గాల స్ట్రాంగ్ రూముల వద్ద ఓట్లు లెక్కింపు ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లు ప్రారంభమయ్యాయని జేసీ రామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత వాతావరణంలో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియను నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.

పొన్నచెట్టు వాహనంపై సత్యదేవుని ఊరేగింపు

అన్నవరం: సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల్లో నాలుగో రోజు వైశాఖ శుద్ధ త్రయోదశి, మంగళ వారం రాత్రి శ్రీసత్యదేవుడు, అమ్మవారిని పొన్నచెట్టు వాహనంపై ఘనంగా ఊరేగించారు. రాత్రి తొమ్మిది గంటలకు శ్రీసత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఊరేగింపుగా కొండదిగువన తొలిపాంచా వద్దకు తీసుకువచ్చారు. అక్కడ సర్వాంగసుందరంగా అలంకరించిన పొన్నచెట్టు వాహనంపై స్వామి, అమ్మవార్లను ప్రతిష్ఠించి పండితులు పూజలు చేశారు. అనంతరం దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్ స్వామి, అమ్మవార్లను దర్శించి పూజలు చేశారు. అనంతరం పొన్నచెట్టు వాహనం ముందు కొబ్బరి కాయ కొట్టి ఊరేగింపు ప్రారంభించారు. శ్రీసత్యదేవుని తొలిపావంచా వద్ద నుంచి ఆంధ్రాబ్యాంక్ సెంటర్ వరకూ, అక్కడి నుంచి మరలా తొలిపావంచా వరకూ ఊరేగింపు సాగింది. ఈ సందర్భంగా కళాకారులు పలు కళారూపాలను ప్రదర్శించారు.



పొన్నచెట్టు వాహనం మీద ప్రత్యేక అలంకరణలో సత్యదేవుడు, అమ్మవారు

ఉపాధి లక్ష్యాలను పూర్తి చేయాలి

- పని దినాలు పెంచాలి
- అధికారులకు కలెక్టర్ నివాస్ ఆదేశం



సీఎస్ జవహర్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో పాల్గొని మాట్లాడుతున్న కలెక్టర్ నివాస్

కాకినాడ సిటీ: జాతీయ ఉపాధి హామీ పనుల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టి నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ జె నివాస్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి వెలగపూడి రాష్ట్ర సచివాలయం నుంచి మంగళవారం కలెక్టర్‌తో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నివాస్ కలెక్టరేట్ నుంచి పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిమిత్తం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా పనుల్లో పురోగతి కనబరచాలన్నారు. పని దినాల సంఖ్య పెంచేందుకు ప్రత్యేక కృషి చేయాలన్నారు. ప్రధానంగా జిల్లాలో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు ప్రణాళిక ప్రకారం వ్యవహరించాలన్నారు. అలాగే వేసవి దృష్ట్యా విద్యుత్ సమస్యలు ఎదర్కొనకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సాధారణ ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ ప్రక్రియను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో బాణసంచా విక్రయాలు నిషేధించాలన్నారు. బాణసంచా తయారీ, విక్రయ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం ఎటువంటి విజయోత్సవ ర్యాలీలు జరపకుండా క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తతో వ్యవహరించాలని కలెక్టర్ నివాస్ అధికారులను ఆదేశించారు. సీఎస్ జవహర్‌రెడ్డి జాతీయ ఉపాధి హామీ పథకం పనులు, పని దినాలు, తాగునీటి సరఫరా, వేసవిలో విద్యుత్ సరఫరా, లా అండ్ ఆర్డర్, ఓట్ల లెక్కింపు ప్రక్రియకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇతర ప్రాధాన్య అంశాలపై కలెక్టర్ నివాస్‌తో సమీక్షించారు.

తంటికొండ వెంకన్నకు ప్రత్యేక పూజలు

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. కల్యాణోత్సవాల్లో నాలుగో రోజు మంగళవారం ఉదయం ఆలయ అర్చకులు స్వామి వారికి నిత్యోపాసన, బలిహరణ, సాయంత్రం పండిత సభ, విశేషార్చనలు నిర్వహించారు. కల్యాణోత్సవాలను పురస్కరించుకుని స్వామిని పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. విశేష సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



ప్రత్యేక అలంకరణలో తంటికొండ వెంకన్న

తెలుగుభాషా పరిజ్ఞానం అవసరం

పెద్దాపురం: తెలుగు భాష, తెలుగుతనంపై విద్యార్థుల పిన్న వయసు నుంచే మంచి పరిజ్ఞానం కలిగి ఉండాలని ఎంపి తెలుగు అధ్యాపకుడు టి.సుబ్బారావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం తెలుగు పద్యాలు, కథలు, పుస్తక సమీక్ష వంటి అంశాలపై సుమారు 30 మంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు మాట్లాడుతూ గ్రంథాలయంలో అందిస్తున్న పుస్తకాలను చదివి విద్యార్థులు గ్రంథాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

కౌంటింగ్ ప్రక్రియకు సహకరించండి

పార్టీల నేతలతో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

జగ్గంపేట: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. జగ్గంపేటలోని శివ పార్వతి కల్యాణ మండపంలో మంగళవారం నియోజకవర్గానికి చెందిన పార్టీ ముఖ్య నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించారని కృతజ్ఞతలు తెలిపారు. అదే తరహాలో కౌంటింగ్ ప్రక్రియకు కూడా సహకరించాలని కోరారు. కౌంటింగ్ అనంతరం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చూడాలన్నారు. అల్లర్లకు, హింసాత్మక సంఘటనలకు పాల్పడరాదని తెలిపారు. ఎవరైనా గొడవలకు పాల్పడితే అనవసరంగా కేసుల్లో ఇరుక్కోవాల్సి వస్తుందన్నారు. ఎన్నికల్లో గెలుపొందిన వారు విజయోత్సవ ర్యాలీలు నిర్వహించాలంటే అనుమతులు తప్పనసరిగా తీసుకోవాలని చెప్పారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ, విజయోత్సవాల సందర్భంగా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలన్నారు. సమావేశంలో వివిధ పార్టీల నేతలు, ట్రైనీ ఐపీఎస్ అధికారి నవజ్యోతి మిత్రా, పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి, జగ్గంపేట సీఐ లక్ష్మణరావు, ఎస్సై నాగార్జునరాజు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో జరిగిన సమావేశానికి హాజరైన వివిధ పార్టీల నాయకులు

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణ

ప్రత్తిపాడు: చెదురుమదురు సంఘటనలు మినహా జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. ఇందుకు వివిధ రాజకీయ పార్టీల నాయకుల సహకారం ఎంతో ఉందన్నారు. ప్రత్తిపాడు సరయు కన్వెన్షన్ హాల్ ఆవరణలో మంగళవారం సాయంత్రం నియోజకవర్గంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యేంత వరకు ఇదే సహకారాన్ని అందించాలని కోరారు. విజయోత్సవ ర్యాలీలకు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా పోలీసులు తీసుకునే చర్యలకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి, ప్రత్తిపాడు సీఐ ఎం సతీష్‌బాబు, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, అన్నవరం, రౌతులపూడి ఎస్సైలు ఎం పవన్‌కుమార్, సతీష్, కిషోర్, నబీతో పాటు, వైఎస్సార్ సీపీ నాయకులు వరుపుల సూరిబాబు, బెహరా దొరబాబు, పైలా బోస్, వాసిరెడ్డి భాస్కర రావు, ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు.



జగ్గంపేట సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్